## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 13: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో ఉంటున్న ఒగ్గు సాయిలు(55) దర్జీగా పనిచేస్తున్నాడు. బుధవారం తంగళ్లపల్లి నుంచి కేసీఆర్‌నగర్‌కు సైకిల్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సైకిల్‌ను ఢీకొట్టడంతో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు చేరుకుని విచారణ చేపట్టారు.

# ఓటరు నమోదుకు మరో అవకాశం

- **సద్వినియోగం చేసుకోవాలంటున్న ఈసీ**
- **పద్దెనిమిదేండ్లు నిండిన వారిపై అధికారుల దృష్టి**

కలెక్టరేట్, డిసెంబర్ 13: కొత్త ఓటర్ల నమోదే లక్ష్యంగా ఎన్నికల సంఘం మరోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల గడువు కూడా సమీపిస్తున్న నేపథ్యంలో పద్దెనిమిదేండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. కొద్ది రోజుల క్రితమే ఈ ప్రక్రియను పునఃప్రారంభించగా, ఓటరు జాబితాలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా కొత్తగా పేర్లు నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేయడంతో, మూడు రోజుల నుంచి బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ తిరగడం మొదలుపెట్టారు. ఫిబ్రవరిలో తుది జాబితా ప్రకటన అనంతరం ఆన్‌లైన్ వెబ్‌సైట్ మూసివేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సాధారణ ఎన్నికల కోసం ఎన్నికల సంఘం ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచి కొత్త ఓటర్ల నమోదుకు శ్రీకారం చుట్టింది. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు పలు మార్లు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం, అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది. పలువురు ప్రభుత్వ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి, స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి సత్ఫలితాలు సాధించింది. అయితే, ఇంకా అనేక మంది మిగిలి ఉన్నారనే అభిప్రాయంతో వారిని కూడా ఓటర్లుగా నమోదు చేయాలనే సంకల్పానికి ఈసీ శ్రీకారం చుట్టింది. గత నవంబర్ 11వరకు జిల్లాలో 10,59,215 మంది ఓటర్లుండగా, వీరిలో కరీంనగర్ సెగ్మెంట్ పరిధిలో 6,356 మంది, చొప్పదండి పరిధిలో 5,377, మానకొండూరులో 4,826, హుజూరాబాద్‌లో 7,568 మంది మొత్తంగా నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి 24,127మంది యువత కొత్తగా ఓటు హక్కు పొందారు. కళాశాలల్లోని విద్యార్థుల సంఖ్య, వారు చదువుతున్న సంవత్సరాన్ని బట్టి 18 ఏండ్లు నిండిన వారు ఇంకా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు గుర్తించారు. వీరిని కూడా ఓటర్లుగా నమోదు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలననుసరించి, స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా విద్యా సంస్థల్లో అవగాహన పెంపొందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 6న ముసాయిదా జాబితా వెలువరించనుండగా, ఫిబ్రవరి 8న తుది జాబితాను ప్రకటించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు తెలిపారు. అన్ని మండలాలు, పట్టణాలు, పురపాలక సంఘాల్లోని పోలింగ్ కేంద్రాల వారీగా ఈ ప్రక్రియ కొనసాగించేందుకు చర్యలు చేపడుతున్నారు.

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఒకటి జనవరి 2024 వరకు పద్దెనిమిదేండ్లు పూర్తి చేసుకుంటున్న వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. స్వీప్ ఆధ్వర్యంలో యువతకు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయబోతున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా కృషి చేస్తున్నాం. ఆఫ్‌లైన్‌లో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఫారం- 6 ద్వారా ఓటు హక్కు నమోదు చేసేలా చర్యలు చేపడుతున్నాం.

**-కే మహేశ్వర్, ఆర్డీవో**

## ఉమ్మడి జిల్లా రవాణాశాఖ ఆదాయం ₹202కోట్లు

తిమ్మాపూర్, డిసెంబర్13: ఉమ్మడి జిల్లా రవాణా శాఖ వార్షిక ఆదాయం ₹202.88కోట్లు వచ్చినట్లు రవాణా శాఖ ఉపకమి షనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. బుధవారం తిమ్మా పూర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాల వారీగా సమీక్ష చేసి వార్షిక ఆదాయం ప్రకటించారు. కరీంనగర్ జిల్లా ₹90.81కోట్లు, పెద్దపల్లి జిల్లా ₹50.50కోట్లు, జగిత్యాల జిల్లా ₹37.53కోట్లు, సిరిసిల్ల జిల్లా ₹24.04కోట్లు ఆదాయాన్ని గడించాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులకు మరింత మెరుగైన సేవలందించాలని అధికారులకు సూచించారు. కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లను పటిష్ట పర్చాలని, టీ యాప్ పోలియో ద్వారా జరిగే ఆన్‌లైన్ సేవలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాల్లో సొంత భవనాలు లేని కార్యాలయాలకు స్థలాలు పొందేలా కృషి చేయా లన్నారు. జిల్లా రవాణా అధికారులు రంగారావు, కొండల్‌రావు, నాగలక్ష్మి, వంశీధర్, ఎంవీఐలు, ఏఎంవీఐలు పాల్గొన్నారు.



**మాట్లాడుతున్న డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్**

## కార్తీకమాస ఆదాయం ₹9.13కోట్లు

- **రాజన్నకు గతేడాది కంటే రూ.88లక్షలు ఎక్కువగా సమకూరిన ఆదాయం**
- **ఈవో కృష్ణప్రసాద్**

వేములవాడ, డిసెంబర్ 13: కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి ₹9కోట్ల 13లక్షల 50వేల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. గతేడాది ₹8కోట్ల 25లక్షల 45వేల ఆదాయం రాగా, ఈ ఏడాది దాదాపు ₹88లక్షల ఆదాయం అధికంగా వచ్చినట్లు ఆయన చెప్పారు. హుండీ ద్వారా ₹3.07 కోట్లు, కోడె మొక్కుల ద్వారా ₹2.03 కోట్లు, ప్రసాదాల ద్వారా ₹1.77 కోట్లు, స్వామివారి ఆర్జిత సేవలు అభిషేకం, కళ్యాణం, పల్లకీసేవ, సత్యనారాయణ వ్రతం సేవల ద్వారా ₹74 లక్షలు, ఇతర ఆర్జిత సేవల ద్వారా రూ.50లక్షలు, ధర్మశాలల అద్దెల ద్వారా ₹35లక్షలు, శీఘ్రదర్శనం ద్వారా ₹26లక్షలు, అనుబంధ ఆలయాల్లో ఆర్జిత సేవల ద్వారా ₹16లక్షలు, ఇతర ఆదాయంతో మరో ₹2కోట్లతో కలిపి స్వామివారికి ₹9కోట్ల 13లక్షల 50 వేల ఆదాయం సమకూరిందని ఈవో తెలిపారు.

# లక్ష్యానికి చేరువలో కొనుగోళ్లు

- **ఇప్పటి వరకు 1,39,315 క్వింటాళ్ల ధాన్యం సేకరణ**
- **రానున్న 20 రోజుల్లో పూర్తి చేసేలా ఏర్పాట్లు**

పెద్దపల్లి, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నది. సమృద్ధిగా సాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా కావడంతో పెద్దఎత్తున ధాన్యం రైతుల చేతికొచ్చింది. జిల్లాలోని 13 మండలాల్లో 2లక్షల 4వేల ఎకరాల్లో లక్షా11వేల మంది రైతులు వరి సాగు చేయగా, 4.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లను అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందు కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, డీసీఎంఎస్, సహకార సంఘాల ఆధ్వర్యంలో 307 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా సరిపడా కాంటాలు, గన్నీ సంచులతోపాటు హమాలీలు, లారీలను అందుబాటులో ఉంచారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విధంగా టర్ఫాలిన్లను సైతం అందుబాటులో ఉంచి, కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

### 307కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తి

పెద్దపల్లి జిల్లాలోని 13 మండలాల్లో ఏర్పాటు చేసిన 307 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 1,39,315 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు రైతుల నుంచి సేకరించారు. ఇప్పటి వరకు 35కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేశారు. 1,38,574 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. ఇంకా 272 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60-65వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నది. మరో 15 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### మార్కెట్‌లో మంచి డిమాండ్..

సన్న రకాలతోపాటు నిత్యం వినియోగించే కామన్ రకాల వరి పంటను సాగు చేయడంతో ప్రైవేట్‌గా సైతం మార్కెట్‌లో ఈ ఏడాది మంచి డిమాండ్ వచ్చింది. దీంతో అడ్తి వ్యాపారులు, రైస్‌మిల్లర్లు నేరుగా రైతుల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేశారు. త్వరగా నగదు కూడా ఇవ్వడంతో రైతులు సైతం వారికి విక్రయించేందుకు ఆసక్తి చూపారు.



**రామగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు (ఫైల్)**

### బియ్యం, సీడ్‌కు తరలిన ధాన్యం..

జిల్లాలో ఈ ఏడు సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలుపై ప్రజలు సైతం ఆసక్తి చూపారు. జిల్లాలో 40వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని నేరుగా ప్రజలు రైతుల వద్ద కొనుగోలు చేశారు. అదే విధంగా రైతులు పండించిన పంటనే సీడ్ కోసం సైతం ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టారు. సీడ్ కోసం దాదాపు 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు సేకరించుకున్నారు. మొత్తంగా 80వేల మెట్రిక్ టన్నుల వరకు ఇలా వినియోగమైంది. దీంతో కొనుగోలు కేంద్రాలకు భారం తప్పింది.

### నెలాఖరులోగా పూర్తి చేస్తాం

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నం. ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుంది. ధాన్యం కొనుగోళ్ల కోసం 307 కేంద్రాలు ఏర్పాటు చేసినం. ఇప్పటికే 35 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయింది. 272 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60-65వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రానున్న 15 రోజుల్లో కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

**- దోమ ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి (పెద్దపల్లి)**

## దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, డిసెంబర్ 13: రాంనగర్‌లోని వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్, డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సీసీటీవీ, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు డీవైఎస్‌వో కే రాజవీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబర్ 96409 67943లో సంప్రదించాలన్నారు.

## బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్13: బైక్ అదుపుతప్పి తీవ్రగాయాలైన యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఎల్‌ఎండీ ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణంలోని మధురానగర్‌కు చెందిన శనిగరపు సాయికుమార్(16), చిలువేరు విజయ్ మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో అల్గునూర్ బ్రిడ్జిపై అతివేగంగా వస్తూ అదుపు తప్పడంతో బ్రిడ్జిపై పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టారు. దీంతో కింద పడిన ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా, జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున సాయికుమార్ మరణించాడు. ఆయన తండ్రి బానేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

## వాలీబాల్ విజేతగా గిరిజన డిగ్రీ కళాశాల

కొత్తపల్లి, డిసెంబర్ 13: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన వాలీబాల్ జట్టు ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో విజేతగా నిలిచినట్లు పీడీ ఎండీ సర్వర్ పేర్కొన్నారు. ఎస్‌యూలో జరిగిన వాలీబాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు నవీన్, సడవాలి అద్భుత ప్రతిభ చూపి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. వీరు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

CHANGE OF NAME

★I, JOGINIPELLI MAHESHVARARAO, R/o. 5-4/1, Kalleda, Jagityal, TS. I have Changed My Name as JOGINIPALLI MAHESHWAR RAO, S/o. Joginipalli Kanta Rao.
NT-324460

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194